
# తారుమారు

-పక్కి బాలకృష్ణారావు



టీచర్స్ కాలనీలోకి మేము ఇల్లు మార్చేము. ఈ కొత్తింటికి అందరూ వచ్చి చూశారుగానీ, మర్రిపాలెం నుండి మా పెద్దమ్మాయి వాళ్లు మాత్రం రాలేకపోయారు. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. ఆ మనుమరాళ్లను చూడాలని తహతహలాడిపోతున్నాం. అదేదో సామెతలా అసలు కంటే వడ్డీ ముద్దంట. అదే ఇది. ఓ సారి మేమే వెళ్లి చూసివద్దామని నిశ్చయించాము.

ఒకరోజు తెల్లవారుజామున లేచి డి.ఎం.యు.లో వెళ్లాలని ప్రపోజల్స్ పెట్టాం. మాకు రైలే చాలా అనుకూలమైనది. బస్సులోనైతే ముప్పది రెండు రూపాయలు. రైల్లో అదే పంతొమ్మిది రూపాయలు. పైగా సౌకర్యం. ఒక చిన్న బ్రీఫ్ కేసులో బట్టలు సర్దుకొని నేనూ మా శ్రీమతి బయలుదేరాం. మా ఇంటికి దగ్గర్లో రిక్షాస్టాండు లేదు. ఒక ఫర్లాంగు దూరం నడిస్తే అక్కడో సినిమా హాలుంది. అక్కడే రిక్షాస్టాండు. కనుచూపు మేరలో ఒక రిక్షా కూడా కనిపించలేదు. మాకు స్టేషన్ సుమారుగా రెండు కిలోమీటర్ల దూరం.

చేతిలో సూట్‌కేసు లేకపోతే మార్నింగ్ వాక్‌లా నడిచిపోగలం. కానీ బరువైన బ్రీఫ్ కేసు. రిక్షా చూసేసరికి బ్రీఫ్ కేసు బరువెక్కిపోయింది.

"స్టేషన్‌కు వస్తావా?" అంటూ సూటుకేసును రిక్షాలో కుదేశాను.

"వస్తాను బాబూ! రండి!" అంటూ తుండుగుడ్డతో మరోసారి సీటు శుభ్రంగా తుడిచి నమ్రతగా "రండమ్మా ఎక్కండి" అంటూ అభ్యర్థించాడు.

మా శ్రీమతి బేరం చేయనిదే రిక్షా ఎక్కదు. "ఎంత కొస్తావ్?" ప్రశ్నించింది.

"పదేనివ్వండి... బోనీ బేరం" అంటూ రిక్షాను రోడ్డుమీదకు తీసుకువచ్చాడు.

"పదిస్తాం...వస్తావా?" కరాకండిగా చెప్పింది.

"మరెందుకు పన్నెండు ఇవ్వండి...బోనీబేరం తల్లీ.." అంటూ రాజీకి వచ్చాడు.

"నీ దగ్గర చిల్లరుందా? నా దగ్గర ఇరవై నోటుంది... ఎనిమిది రూపాయల చిల్లరుంటే చెప్పు" శ్రీమతి ఎదురు ప్రశ్న.

"తెల్లారి...సిల్లరెక్కడిది తల్లీ... బోనీ బేరం... రండి...రండి... ఎక్కండి..." అంటూ ఒప్పందానికి వచ్చాడు.

"సరే! పదిస్తాను... అక్కడకు వెళ్లాక గొడవ పెట్టకు" అంటూ శ్రీమతి పాదం మోపింది.

నా దగ్గర ఐదు రూపాయల నాణెం ఒకటుందని నాకే తెలుసు... శ్రీమతికి తెలియదు. రెండు రూపాయలు ఆదా చేసిన సంతృప్తి మా ఆవిడ ముఖంలో పూర్ణచంద్రుడిలా వెలిగిపోయింది. టాప్ తీయించి కూర్చున్నాం.

రిక్షా రైలు గేటు దాటి ఎడమ వైపు మళ్లించి గతుకుల దారి పడింది. ఆ గతుకుల్లో రిక్షా రెండు రూపాయలు ఆదా చేసిన ఆనందం ఎంతోసేపు ఉండలేదు. అక్కడ నుండి రోడ్డు చాలా అధ్వాన్నంగా ఉంది. గతుకులు, ఎత్తుపల్లాలు. రిక్షావాడు దిగి నడిపించసాగాడు.

సూర్యోదయం ఇంకా కాలేదు. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. అంత శీతలంలో కూడా రిక్షావాడికి చెమటలు పట్టాయి. వాడి కష్టానికి పదిహేను రూపాయలిచ్చినా తప్పులేదు. నా జేబులోని నాణెం కూడా వాడికిచ్చేద్దామన్నంత ఆవేశం రాకపోలేదు. మేము రిక్షా దిగాము. పది రూపాయల నోటు ఇవ్వగా ఆనందంగా అందుకున్నాడు. ఆ నోటుతో హేండిల్ బార్‌ను స్పృశించి కళ్లకద్దుకుని ముక్కోటి దేవతల్ని స్మరించి ఆ నోటును జాగ్రత్తగా సీటు కింద బాక్స్‌లో దాచుకున్నాడు. "వస్తానమ్మా!" అంటూ నవ్వుతూ వెళ్లిపోయాడు.

రెండు రూపాయలు ఆదా చేసిన సంతృప్తి ఛాయలు మరోసారి మా ఆవిడ ముఖంలో. నేను తప్పు చేసిన వాడిలా సిగ్గుపడ్డాను.

గరివిడి రైల్వేస్టేషన్ చాలా చిన్నది. ఒక చిన్నగదిలో ఒక పక్క ఎస్సెమ్, ఆయనకు పక్కనే బుకింగ్ విండో.

అప్పుడే నలుగురైదుగురు ప్రయాణీకులు వచ్చి తలా ఒకచోట నిలబడి ఉన్నారు.

కాస్సేపటికి ఎస్సెమ్‌గారు కౌంటరు దగ్గరకు వచ్చి "ఎక్కడికి" అడిగారు.

"రెండు మర్రిపాలెం" చెప్పాను.

ఏభై రూపాయల నోటిచ్చాను. మాస్టరుగారు రెండు టిక్కెట్లు ధన్‌ధన్‌మని గుద్దేసి "మూడ్రూపాయల చిల్లరుందా? అయిదిస్తాను" అంటూ రెండు టిక్కెట్లు ఒక పది రూపాయల నోటు ఇచ్చారు. టిక్కెట్టు ఒక్కొక్కటి పందొమ్మిది రూపాయలు. రెండూ కలసి ముప్పై ఎనిమిది ప్లస్ పది వెరసి నలభై ఎనిమిది... రెండు రూపాయలు స్టేషన్ మాస్టారు నొక్కేశారు. అక్కడ రిక్షావాడి దగ్గర మేము నొక్కాం సరిపోయింది. అదేదో సినిమాలో చెప్పినట్లు లెవెలైపోయింది.

రెండు రూపాయల కోసం కౌంటర్ దగ్గర నిలబడటం ఎబ్బెట్టుగా తోచింది. ఇంతలో రైలు రానున్నట్లు గంటకొట్టారు. మేము కౌంటర్ వీడి ప్లాట్‌ఫారం చేరుకున్నాం.

రెండు రూపాయలు కృష్ణార్పణం. ఇంతలో ఒక రైల్వే గాంగ్‌మెన్ చేతిలో జెండాలు పట్టుకొని హడావిడిగా వచ్చి "సార్! ఎస్సెమ్‌గారు మీకిమ్మన్నారు" అంటూ ఒక నాణెం నా చేతిలో పెట్టి పరుగు పరుగున వెళ్లిపోయాడు. అది రెండ్రూపాయల బిళ్ల. నేను అవాక్కయ్యాను. మాస్టరుగారు జెంటిల్‌మన్. మా అంచనాలు తారుమారయ్యాయి. ఇంతలో రైలు వచ్చేసింది. రెండు గంటలు ప్రయాణం చేసి మర్రిపాలెంలో దిగాం.

మర్రిపాలెం గేటు దగ్గర ఆటో మాట్లాడి సాయినగర్ చేరుకున్నాం. మా అమ్మాయికి ముందుగా ఫోన్ చేయకుండా సర్ప్రైజ్ చేద్దామనుకుని ఆటో దిగి డబ్బులు ఇస్తుండగానే పక్కింటివాళ్లు చూసి "అరే...మీరా? మీ అమ్మాయి... పిల్లలు ఇందాకనే మీ దగ్గరకు బయలుదేరారు."

ఆ మాట విని మేము మరొక్కసారి అవాక్కయ్యాం. గోడకు కొట్టిన బంతిలా అదే ఆటోలో బస్టాండుకు చేరుకున్నాం. రెడీగా పాలకొండ బస్సు బయలుదేరుతోంది. దాంట్లో కూలబడ్డాం. మా అంచనాలు రెండోసారి చిత్రంగా తారుమారయ్యాయి.

★